క్లుప్తంగా

అధికారులు కీలకం

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ యూనిట్ల పనితీరు, డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. సోమవారం ఉదయం రాజమండ్రి రూరల్ నియోజక వర్గ సహాయ రిటర్నింగ్ అధికారులకు, డిప్యూటీ తహసీల్దార్లకు సమావేశం నిర్వహించారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ఈవీఎం, ఇతర బ్యాలెట్ యూనిట్ల పనితీరు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల వద్ద నిర్వర్తించే విధులు, బాధ్యతలపై పీవో, ఏపీవోలకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై ఈనెల 15న నిర్వహించే తొలి శిక్షణ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 267 మంది పీవోలు, 267 ఏపీవోలు, 1056 మంది ఓపీవోలు, 56 మంది సూక్ష్మ పరిశీలకులు.. వెరసి 1,658 మంది ప్రత్యక్షంగా ఎన్నికలలో బాధ్యతలు నిర్వర్తిస్తారని, వీరికి అదనంగా మరో 10 శాతం మంది రిజర్వ్ సిబ్బందిని కూడా నియమిస్తున్నామన్నారు.

తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ తాత్కాలిక స్ట్రాంగ్‌ను న్యాక్ భవనంలో ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్ భరత్ తెలిపారు. ఆ స్ట్రాంగ్ రూమ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 12, 13 తేదీల్లో రాండమైజేషన్ తదుపరి తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలకు చెందిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లను అత్యంత భద్రత మధ్య తీసుకువస్తామన్నారు. అప్పటిలోగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

కడియం: మండలం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నారు. సోమవారం 76 మంది తమ రాజీనామా లేఖలను ఎంపీడీవో జి.రాజ్ మనోజ్‌కు అందజేశారు. వీరిలో మురమండకు చెందిన 33 మంది, వేమగిరికి చెందిన ఏడుగురు, కడియానికి చెందిన 36 మంది ఉన్నారు. కొందరు రాజకీయ నాయకులు తమపై తప్పుడు ఆరోపణలు చేయడంతో మనస్తాపం చెంది కొందరు, వ్యక్తిగత కారణాలతో మరికొందరు ఈ రాజీనామాలు చేస్తున్నట్లు లేఖల్లో పేర్కొన్నారని ఎంపీడీవో తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

కడియం: స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో జనసేన నాయకుడు ఎం.శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సోమవారం ప్రారంభించారు. అనంతరం మజ్జిగ, రస్నా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్రగడ జెమి, వెలుగుబంటి నాని, కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రాంజీ పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: మురమండలోని పాస్టర్ పి.శామ్యూల్ రాజు మందిరంలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఫెలోషిప్ సెక్రటరీ సీహెచ్ రత్నదీప్ అధ్యక్షత వహించగా, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, చీఫ్ పెట్రాన్ సభ్యులు డాక్టర్ రత్నరాజు శుభాలు అందించారు. ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి వాక్య సందేశాలు అందించారు. అనారోగ్యానికి గురైన ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బిషప్ రైస్ హార్ట్‌కు ఫెలోషిప్ తరపున రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు.

అనుమతి పత్రాల పరిశీలన

కడియం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పలు వాహనాల అనుమతి పత్రాలను ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ సోమవారం పరిశీలించారు. దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం గ్రామాల్లో పర్యటించిన ఆయన.. ఆయా వాహనాలకు అన్ని అనుమతులు ఉన్నాయా అని ఆరా తీశారు.

409 మందికి వైద్య పరీక్షలు

కడియం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీరవరంలో సోమవారం 409 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు ప్రభుత్వ వైద్యురాలు జి.స్వరూప తెలిపారు. డాక్టర్లు జెస్సీ సుప్రియ, వినయ్, భువనేశ్వరి తదితరులతో కలిసి తమ బృందం వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిందన్నారు.

అన్నసమారాధన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటలోని ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మూడురోజుల పాటు భక్తులకు ఆలయ వ్యవస్థాపక కార్యదర్శి తోట సుబ్బారావు ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానసరస్వతీ పీఠం సేవాదళ్ కార్యకర్తలు సేవలు అందించారు.

ఎన్‌జేపీ మేనిఫెస్టో విడుదల

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందించడమే నేషనలిస్టు జనశక్తి పార్టీ (ఎన్‌జేపీ) లక్ష్యమని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కడియం సూరిబాబు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను పోటీ నిలబెడుతున్నట్లు ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పట్నాల మురళీకృష్ణకు నియామక పత్రం అందించారు.

జగన్ సంక్షేమ పాలనకు ప్రజాదరణ

- పథకాలతో పేదల అభ్యున్నతి
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు
- సాదరంగా ఆహ్వానించిన మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్



మంత్రి వేణుగోపాలకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో ఎంపీ భరత్‌రామ్

ధవళేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజాదరణ లభిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరంలో సోమవారం టీడీపీ నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో భారీగా చేరారు. మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు కరుకు ఇమ్మానియేల్, జాలరిపేటకు చెందిన సుమారు 300 మందితో కలిసి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే హార్లిక్స్ ఫ్యాక్టరీ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి నారపురెడ్డి మురళీ, బొడ్డు శ్రీను, బందిల తేజ, సుమారు 300 మందితో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి వేణుగోపాలకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించిన ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్ పార్టీలో చేరుతున్నారన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారు సైనికుల్లా పనిచేసి త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు వృద్ధుల సంక్షేమాన్ని విస్మరించారని, ఆయన వల్లే పింఛన్ల కోసం ఎండలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని, ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ ప్రజల మెచ్చే పాలన అందిస్తారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి, జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, చెల్లుబోయిన ఉమాశంకర్, సాధనాల చంద్రశేఖర్ (శివ), ఒంటిద్దు కృష్ణ, సత్యం రమణ, మెండా రాజేష్, తలారి వరప్రసాద్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, ముత్యాల పోసికుమార్, ముత్యాల జాన్, బర్రి కామేశ్వరరావు, కళ్యాణిరెడ్డి, పట్టపగలు వెంకటలక్ష్మి, హమీద్ బాషా, షట్టర్ బాషా, పందిళ్ల భానుప్రసాద్, పేరాబత్తుల శ్రీదేవి, పసుపులేటి దేవి, చప్పిడి జ్యోతి, గరగ శ్రీనివాస్, పెన్నాడ జయప్రసాద్,కేతా సాయి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ మహాయజ్ఞం : ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో రాష్ట్రంలో సంక్షేమ మహాయజ్ఞం జరుగుతోందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. 39వ డివిజన్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన సుమారు 200 మంది సోమవారం ఉల్లూరి రాజు, ఆయన స్నేహ బృందం నేతృత్వంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఎంపీగా నగరాన్ని అత్యద్భుతంగా అభివృద్ధి చేశానన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమం ఆగకుండా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు నాయుడి హామీలు, అబద్ధాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు. వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయకుండా తానే చంద్రబాబుకు చెప్పి ఆపివేయించానని సిటీ ఎమ్మెల్యే భవాని భర్త శ్రీనివాస్ గొప్పగా చెప్పారన్నారు. సమయానికి పెన్షన్లు అందక రాష్ట్రంలో 39 మంది అవ్వాతాతలు మరణించారన్నారు. వారి మరణానికి టీడీపీయే కారణమన్నారు. నగరంలో బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లను టీడీపీ నేతలు పెంచిపోషిస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇటువంటి అరాచకవాదులను ఉక్కుపాదంతో అణచివేస్తానని చెప్పారు. ఆదిరెడ్డి కుటుంబం 16 ఏళ్లుగా అధికారంలో ఉన్నా నగరాభివృద్ధికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదన్నారు. తనని ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేసి విశ్వ నగరంగా గుర్తింపు పొందేలా చేస్తానన్నారు. నగర వాసులకు 24 గంటలూ మంచినీటి సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇంకా నిరుపేదలెవరికైనా ఇళ్ల స్థలాలు రాకుంటే, తాను ఎమ్మెల్యే అయిన 90 రోజుల్లో వారికి స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ నీలి ఆనంద్ కుమార్, నగర యువత అధ్యక్షుడు పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా



కాతేరులో పార్టీలో చేరినవారితో మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి వేణు అన్నారు. కాతేరులోని బాబూ జగ్జీవన్‌రామ్ పేటలో సోమవారం సాయంత్రం 28వ డివిజన్ ఇన్‌చార్జి బిల్డర్ చిన్నా ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనకు చెందిన 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన ఉండ్రాజవరపు సూర్య, పోసుపో రత్నరాజు, తానేటి జెమిని, ఉండ్రాజవరపు పవన్ కుమార్, పోసుపో దినేష్, కంకిపాటి దినేష్, కోమ్ము వివేక్, రమణ, శ్రీనివాస్, స్పందన కుమార్ తదితరులకు మంత్రి వేణు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని, రాబోవు ఎన్నికలలో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రానుందన్నారు. కార్యక్రమంలో ఆచంట కళ్యాణ్, కొల్లి నాని, బోట్ రాము, సంకు సత్తిరాజు, దువ్వాడ గౌరి, కంకినాటి నాగేశ్వరరావు, కంకినాటి రాజు పాల్గొన్నారు.

లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: 2024–25 ఏడాదికి నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఆరోగ్య కార్యక్రమంపై సోమవారం పర్యవేక్షకులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ, ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతినెలా సుమారు పది ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాలను ప్రజలందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసే అన్ని సమావేశాలలోనూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆన్‌లైన్ కార్యక్రమాలకు సంబంధించి పోర్టల్స్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.రాజకుమారి, కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సంధ్య, డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో మతసామరస్యం



ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఎంపీ భరత్‌రామ్



కొంతమూరు మసీదులో ప్రార్థన చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- కలసిమెలసి జీవించినప్పుడే అభివృద్ధి సాధ్యం
- ఎంపీ భరత్ రామ్, మంత్రి వేణు

రాజమహేంద్రవరం సిటీ: రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులతో మతసామరస్యం వెల్లివిరుస్తుందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. కుల, మత రహితంగా అందరూ కలసి మెలసి జీవించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నగరంలోని హోటల్ మంజీరాలో ముస్లిం సోదరులు సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నగర అభివృద్ధికి హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు సంఘటితమై సోదర భావంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అన్యోన్యంగా ఉండటం వల్లే అభివృద్ధి దిశగా నగరం పరుగులు పెడుతోందన్నారు. ప్రతిపక్షాలు ప్రతి అభివృద్ధి పనికీ ఏదో ఒక విధంగా ఆటంకాలు సృష్టిస్తున్నాయన్నారు. అంతకు ముందు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అరీఫ్, పాలిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్లా దయ అందరిపైనా ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్ (కొంతమూరు): అల్లా దయ అందరిపైనా ఉండాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆకాంక్షించారు. కొంతమూరు మస్జిద్–ఏ–కౌసర్(మసీదు)లో సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన విచ్చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఈ రంజాన్ మాసంలో ప్రపంచ శాంతిని కోరుతూ కఠోర ఉపవాస దీక్షలు చేయడం ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో పార్టీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు గిరజాల బాబు, పార్టీ నాయకులు షేక్ మౌలాలీ, ఎంఎం అలీ, షేక్ బాజీ, షేక్‌చానా, అత్తిలి భీమశంకరం, చెరుకూరి సత్యనారాయణ, ఆచంట కళ్యాణ్, సర్కార్ బాషా, పరిమి దుర్గారావు, పిన్నమరెడ్డి సూర్యచంద్రం, లాయర్ శ్రీను, నల్లమిల్లి సుబ్బారావు, అల్లాడ గణేష్, సుదర్శనరావు, ఆనెం శ్రీనివాస్, పిల్లా శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

కడియం: మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సంగీత గంగాధరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనను సోమవారం రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట సంగీత వెంకటేశ్వరరావు, సింగన శివరామ్, సురేష్, బలుసు అనిల్ కుమార్, ఉండమట్ల శ్రీనివాస్, సూరిబాబు, దుర్గారావు, గుర్రాల శ్రీనివాస్ ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న చందన నాగేశ్వర్

అశోక్ కుమార్ కుటుంబానికి..

ధవళేశ్వరం వద్ద గోదావరిలో మునిగి చనిపోయిన బర్నికల అశోక్ కుమార్ కుటుంబానికి చందన నాగేశ్వర్ సోమవారం ఆర్థిక సాయం అందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అశోక్ కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

సీఎం జగన్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న దుళ్ల నాయకులు

కడియం: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం కడియం మండలం దుళ్లలో పార్టీ నాయకులను కలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్‌ల గృహాలకు వెళ్లి అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడారు. ప్రజలందరికి ఎలాంటి తారతమ్యాలు లేకుండా తాను నాణ్యమైన వైద్యం అందించానని, ముఖ్యంగా కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా జిల్లాలోనే కాకుండా పరిసర ప్రాంతాలలో వైద్య సేవలు అందించిన విషయం ప్రజలు అందరికీ తెలుసునన్నారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో నాయకులను కలిసి పార్టీ విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నానన్నారు. అందులో భాగంగానే దుళ్ల గ్రామానికి కూడా వచ్చానని గూడూరి వివరించారు. తొలుత డాక్టర్ శ్రీనివాస్‌కు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. సర్పంచ్ పట్టియ్య, పార్టీ నాయకులు తాతపూడి బాబీ, కొండపల్లి శివ, ఇందుపరాల శ్రీనివాస్, కంటిపూడి సాయి, ఇమ్మంది నాగరాజు, చాపల శేఖర్, పిచ్చుక చిన వెంకటరావు, కోసూరి లక్ష్మీనారాయణ, కాలెపు చెల్లారావ్, వట్టి శివ, ఉరదాల శ్రీరాములు, జిలగం గంగాధర్, నూలు సోమేశ్వరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సలాది ప్రసాద్, మార్గాని బలరాం, మార్గాని బుజ్జి, తోకల కృపారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

జగన్ వెంటే అన్ని వర్గాల ప్రజలు

ధవళేశ్వరం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే ఉన్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. ధవళేశ్వరంలోని కొత్తపేటలో సోమవారం సాయంత్రం మంత్రి వేణు తనయుడు ఉమాశంకర్‌తో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షర్మిలారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించారన్నారు. పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తలారి వరప్రసాద్, సాధనాల చంద్రశేఖర్(శివ), ముత్యాల పోసికుమార్, ఎస్‌పీ శేఖర్, చాటకాల చంటి, గునిపే అశోక్, పసుపులేటి దేవి, చప్పిడి జ్యోతి, అమ్ములు, పేరాబత్తుల శ్రీదేవి, పందెళ్ల భానుప్రసాద్, కేతా సాయి, విప్పర్తి విజయ్‌కుమార్, దేవదాసి రమేష్, ఎల్‌వి ప్రసాద్, నంబూరి రవి, మిరప రమేష్ పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న షర్మిలారెడ్డి, ఉమాశంకర్

494 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు సచివాలయం –3 పరిధిలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 494 మంది వైద్యసేవలు పొందగా, ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు జి.రోహిత, ఆర్థోపెడీషియన్ జాన్ లియో, గైనకాలజిస్ట్ రుషిక, ఆప్తాల్మిక్ ఆఫీసర్ సాంబయ్యలు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

డ్రీమ్స్‌లో అలరించిన ఉగాది వేడుకలు



ఉగాది పచ్చడి తయారు చేస్తున్న డ్రీమ్స్ విద్యార్థినులు

ధవళేశ్వరం: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూలులో సోమవారం నిర్వహించిన ఉగాది వేడుకలు అలరించాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు సందడి చేశారు. వస్త్రధారణ పోటీలు, అష్టావధానం, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థినులు స్వయంగా ఉగాది పచ్చడి తయారుచేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎ.రమేష్, ప్రిన్సిపాళ్లు వి.సంధ్యాకుమారి, ఎన్.దీపిక, జి. విమలారోజీ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

కారులో రూ.7.07 లక్షల స్వాధీనం

ధవళేశ్వరం: ఎన్నికల నేపథ్యంలో కాటన్ బ్యారేజీ వద్ద సోమవారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ నిర్వహించిన తనిఖీల్లో నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వస్తున్న కారులో రూ.7,07,500 స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎస్ఎఫ్‌టీ టీమ్‌కు అందజేశారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

సీటీఆర్ఐ: వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం వెలగపూడి సచివాలయం నుంచి తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత జిల్లా ప్రగతిని తెలియజేస్తూ వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకున్నామన్నారు. ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఏడాదికి 30 లక్షల పని దినాల లక్ష్యం నిర్దేశించారన్నారు. అమృత్ సరోవర్ కింద 198 పనులను ప్రతిపాదించామని, ఫార్మ్ పాంట్ కింద 1800 లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 255 పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కింద 110 పనులకు 75 మంజూరు చేశామన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

ఇటలీ పర్యటనకు సీటీఆర్ఐ డైరెక్టర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని కేంద్రీయ పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ ఇటలీ వెళ్లనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో ఆ దేశంలోని కాటానియా నగరంలో ఆహార వ్యవసాయ విభాగం 39వ సాంకేతిక సమావేశం జరగనుంది. దానికి డాక్టర్ మాగంటి శేషు హాజరుకానున్నారు. భారత ప్రతినిధి బృందం ఎఫ్ఏడీ అండ్ 4 అధ్యక్షుడి హోదాలో మంగళవారం నుంచి ఈ నెల 13 వరకు అధికారికంగా పర్యటిస్తారు.



డాక్టర్ శేషుమాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న శాస్త్రవేత్తలు

కడియపుసావరంలో ఇరువర్గాల ఘర్షణ

కడియం: ఇటీవల గ్రామంలో జరిగిన జాతర సందర్భంగా కడియపుసావరంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆయా వర్గాలకు చెందిన యువకులు రోడ్లపైకి వచ్చి ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు చెందిన యువకులను చెదరగొట్టారు. కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ మాట్లాడుతూ గ్రామంలోని మూడు చోట్ల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని, ఇరువర్గాలకు చెందిన వారితో చర్చించామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున యువకులు నిబంధనలు మీరకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ దాడులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే మంగళవారం గ్రామంలో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పన్ను చెల్లింపుపై రాయితీ

రాజమహేంద్రవరం సిటీ: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరంలోని ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులను ఏకమొత్తంగా ఈనెల 30వ తేదీలోపు చెల్లించిన వారికి ఐదుశాతం రాయితీ ఇవ్వనున్నట్లు కమిషనర్ దినేష్ కుమార్ సోమవారం తెలిపారు. చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.